ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాలెంతటి నిస్సారమైనవో తెలియవస్తూ ఉంది.

పై విషయాలన్నింటిని గమనిస్తే ఎటువంటి విషమ, అనివార్యపరిస్థితుల్లో పి. ఎస్. పి. మంత్రివర్గబాధ్యతను స్వీకరించిందో తెలియగలదు. ఇక్కడ ఏవిధమైన "కొత్తప్రజాస్వామ్యం" లేదు రావుగారిదృష్టిలో - మెజారిటీపార్టీ అనబడేవాని స్వార్థపూరితరాజకీయాల పర్యవసానంగా ఎన్నికల అనంతరంగూడ రాజప్రముఖ్ పాలన జరిగి, ప్రభుత్వవిషయంలో ప్రజలకుగల బాధ్యతలు, హక్కులు మంటగలిసి పోయేపరిస్థితిలో-ప్రజాబలంమీద నమ్మకంఉంది. ప్రజాశ్రేయస్సుకై ప్రభుత్వాన్ని స్వీకరించటమే ఒక "కొత్తరకమైన-వికృతమైన - పద్ధతి" అయినట్లైతే పి. ఎస్. పి. ఎటువంటి సమయంలోనూ, ఈ విధమైన "వికృతమైన" పద్ధతిని అనుసరించటానికి జంకదు. పైగా ప్రక్కరాష్ట్రంలోని సోదరులుగూడ ప్రజాస్వామ్యప్రభుత్వంక్రింద అభ్యుదయగాములై పురోగమించాలని కోరుకోవటానికి ధైర్యంలేక అక్కడేదో "ప్లేగు" వచ్చినా రావచ్చని మానవత్వాన్నంతా చంపుకొని శ్రీ రావుగారు మాదిరిగా ఎంతమంది ఊహాగానాలు చేసినా ప్రజాశక్తిముందు ఆ గాలి మేడలన్నీ పేకముక్కలకూర్పుమాదిరిగా కూలిపోగలవని పి. ఎస్. పి. విశ్వసిస్తుంది.

స్కెచ్

# "—న భవిష్యతి"

దివ్యప్రభాకర్

టెలిఫోను మోగగానే వీరాస్వామి వెళ్ళి చెవి దగ్గర పెట్టుకున్నాడు. మెయిలు రెండు గంటలు లేటు. వీరాస్వామి మళ్ళీ భార్య మంచం దగ్గరకి ఆత్రుతగా వచ్చాడు. ఆమె మూలుగుతూనే వుంది. మూడు రోజుల్నుంచి జ్వరంతో బాధపడుతోంది. 'అదే పోతుందిలే' అని అశ్రద్ధ చేయటంవల్ల అది ఇవాళ తీవ్రరూపం దాల్చింది. అతనికేమీ పాలుపోవడంలేదు. భార్యకి మంచి నీళ్లు పట్టి వాకిట్లో కొచ్చి ఉత్తరపువేళ పొలంలోకి చూశాడు.

బీటలువారి వానచినుకుకోసం నోళ్లు తెరచుకుని అనంతాకాశంవంక చూస్తున్న ఆ పొలంలో అక్కడక్కడా ఎరువు పోగులూ, పాటిమట్టి పోగులూ పడిఉన్నాయి. తొలకరిదగ్గర పడుతోంది. ఉరుము శబ్దంవిని నెలలు అయింది. అయినా ఎంతో కాలమైనట్లు వానంటే ప్రాణం లేచివచ్చేట్లు ఉంది. ఏళ్లతరబడి వానచినుకు ఎరుగని రాయలసీమ ప్రజలూ, పొలాలూ ఊహించటానికే ఎంత దుర్భరం!

వెంకయ్య యింకా రాలేదు. వీరాస్వామి అతనికోసమే ఎదురుచూస్తున్నాడు. పోనీ ఊళ్లోకి వెళ్ళి ఆచార్లుగారినైనా పిలుచుకొస్తాడేమోనని ఆశ. వీరాస్వామికి నలభై ఏళ్లున్నా ఎన్నడూ అలా ఒంటరిగా జ్వరంతో బాధపడే వ్యక్తి ప్రక్కనుండటం తటస్థించలేదు. ఆరేళ్ళ క్రితం వరకూ తన తల్లి బ్రతికే ఉంది. ఆ తరువాత పెద్ద దిక్కులేక మేనత్త వచ్చి ఉంది, పాపం! రెండేళ్ళ క్రితం ఆవిడా పోయింది. ఎటొచ్చీ ఈ రెండేళ్ళనుంచే యిలా ఒంటరి దాంపత్యమైపోయింది. పోగా పెద్ద దిక్కుగా తెచ్చుకుందుకి ఎవరూ ఆప్తులు లేనూలేరు. కాని అతని జీవితంలో దెబ్బతీసిన ఘట్టం మాత్రం ఏ పెద్ద దిక్కున్నా మర్చిపోలేక గుర్తుకి తెచ్చుకుని భోరున ఏడ్చేవాడు. అతని భార్య కూడా అప్పట్నుంచే ఏమిటోగా మారిపోయింది. అసలు ఆ వెర్రి చూపులూ, భీతిగా రైలుగేటువంక చూడ్డం, రైలు వస్తూంటే ఇంట్లోకి పోవడం అంతకుముందు లేవు. అన్నం వండకుండా ఉండటం సాధ్యమయ్యే పనికాదు. కానీ ఏదో బాధగానూ, తెలీనట్టూ ఉంటూంది. ఎప్పుడూ శూన్యంగా పొలాలవంకా, పట్టాలవంకా చూస్తూ కూర్చునేది.

వీరాస్వామి తన భార్య సుస్తీపడ్డ నేటినుంచి వెనక్కు వెళ్ళాడు. ఆ రోజు తనకి ఒంట్లో బాగుండలేదు. కుక్కి మంచంలో కూలబడి దిక్కులుచూస్తూ కూర్చున్నాడు. బండీ వచ్చే వేళ అయినట్టు గుర్తుకి రాగానే లేచివెళ్ళి గేటు వేసి వచ్చాడు. పరధ్యానంగా జండాకర్రలు చేత పట్టుకొని గేటుకానుకొని నిలబడి ఉన్నాడు. వచ్చేస్తోంది బండి. వీరాస్వామి తనూ యంత్రంలా పచ్చజండా ఎత్తి పట్టుకుని నిలబడ్డాడు.

బండి అతివేగంగా నేల అదిరేలా వెడుతూ పెద్దగా కూతకూసింది. దాంతోపాటే వీరాస్వామికి కెవ్వున కేక వినవచ్చింది. ఖంగారు పడుతూ ప్రక్కకుతిరిగి చూశాడు. మంచంలో పడుకున్న చంటిపిల్లే ఆ కేక వేసినట్టు గ్రహించి జబునుకుండే మోనని దగ్గరకు పరుగెత్తుకువెళ్లాడు. ఆ పసిగుడ్డు ఎప్పుడో పరలోకానికి వెళ్ళింది. వీరాస్వామి పెళ్లాన్ని పెద్దకేకపెట్టి పిలిచాడు. పదిబారల దూరంలో ఉన్న దొరువులో నీరు తోడుతున్న ఆమె పిల్లకేకవిని పరుగెత్తుకొస్తూ, భర్తకేకకూడావిని ముందుకుపడిపోయింది.

లేకలేక కలిగిన ఆ గుడ్డు యిలా రైలుకూతకు ఆహుతి అయిపోగానే కన్నతల్లిగుండె చెదిరింది. వీరాస్వామి ఆమెను ఓదార్చేశక్తిలేక తనూకుమిలి పోతూండేవాడు.

* * *

వీరాస్వామి మళ్ళీ పొలావంక చూశాడు. వెంకయ్య రాలేదు కానీ దూరాన అతనిబండీ కనిపించింది. వీరాస్వామి బండిదగ్గరకు పరుగెత్తుదామనుకున్నాడు. కానీ వెళ్ళలేకపోయాడు. లోపలకు వెళ్ళి భార్యని మెల్లిగా "ఏంకావా"లని అడిగాడు. ఆమె నీరసంగా మూలుగుతూ ఏమీ ఒద్దు' అంది. ఆ మూలుగు వీరాస్వామి గుండెల్లోకి దూసుకుపోతోంది. నిజానికి తనకు ఆమె తోడే లేకపోతే ఈ గేటుకాపలా ఉద్యోగం చేసేవాడేకాదు. ఇంతకాలం ఆమెను చూసుకునే ఆ నిర్జనప్రదేశంలో ప్రశాంత వాతావరణంలో జీవితాన్ని సుఖపూరితం చేసుకున్నాడు. మూడు రోజులకే గుంటలుపడిపోయిన ఆమెకళ్ళూ, అరిపోయిన పెదాలూ, లోయలోంచి వినవస్తున్నట్లున్న ఆ మూలుగూ కని, విని, "నువ్వేలేక పోతే..." అని కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ వాకిట్లోకొచ్చాడు. ఎడ్లమెళ్లో గంటలు వినిపించగానే అటుతిరిగి "వెంకయ్యన్నాయ్!" అని పిలిచాడు. వెంకయ్య పిలుపందుకుని చెయ్యెత్తాడు. వీరాస్వామి "త్వరగా రావాలన్నాయ్" అన్నాడు.

వెంకయ్య ఎడ్లనైనా ఊడదియ్యకుండా పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూవచ్చి "ఏంటీరాసామీ!" అన్నాడు.

"బాబ్బాబు, వెంకయ్యన్నాయ్, ఊళ్ళోకెళ్ళి కాస్త ఆశార్లుగార్ని పిలుసుకురావంటే... దానికియ్యాల మోపుజేసిందే, బాబ్బాబూ... ఇందాకమాల్నుంచీ సూత్తుండా... నరమానవుడగపళ్ళేదు... దేవుడల్లే ఒచ్చావ్... ఎల్లిరా బాబూ!" అప్పుణ్ణిమాస్తే పొంగేదుఃఖంవల్ల వీరాస్వామి మాటలు తడబడ్డాడు.

"ఎల్లొస్తాగానీ...అమ్మాయిని సూణ్కో"అంటూ లోపలికెళ్ళి పలకరించివచ్చి గబగబా ఊరివేపు వెళ్ళిపోతున్నాడు. వీరాస్వామి వెడుతున్న వెంకయ్యని కృతజ్ఞతతో చూసి, పొలంలోకెళ్ళి ఎడ్లని ఊడదీసి వచ్చాడు. బండీవచ్చే వేళవుతూన్నట్లుంది. వీరాస్వామిగుండెలు ఎందుకో వేగంగా కొట్టుకోడం ప్రారంభించాయి.

అతనికి తన పసిపిల్ల గుర్తుకొచ్చింది. మైల్ వస్తూంది వేగంగా...అతివేగంగా ఇల్లూ, గేటూ, తనూ,.తన భార్య మంచం...అన్నీ అదిరిపోతాయి. వీరాస్వామి గబగబా లోపలికెళ్ళి పరుపు చిరిగిన చోటునుంచి దూదిలాగి, విడదీసి భార్యచెవుల్లో ఇంతంత పెట్టాడు. తలకు గుడ్డకట్టాడు. ఒంటి నిండా కంబళీ కప్పాడు. వీరాస్వామికి ఇంకా తృప్తికలగలేదు. ఏంతోచక అటూఇటూ చూశాడు బిక్కముఖంతో, కన్నీళ్ళతో...ఇంట్లోకి, గేటు దగ్గరికీ పరుగెత్తాడు. ఫోను మోగింది. వీరాస్వామి దానివంక భీతితో చూశాడు. మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ ఫోనుదగ్గరకి వెళ్ళి విన్నాడు. మెయిలు వస్తోంది. ప్రక్క స్టేషన్లోనే ఉంది. బయలుదేరబోతోంది మూడుమైళ్ళు...ఎంతసేపు? వీరాస్వామి దణ్ణెంమీద ఉన్న బట్టలన్నీ భార్య మీద పేర్చాడు. తలకి యింకా గుడ్డలు కట్టాడు.

ఆమె మూలుగు హృదయవిదారకంగా, ఆగి ఆగి వస్తోంది. ఆదుర్దాగా వాకిట్లోకిపరుగెత్తుకొచ్చాడు. గేటు వెయ్యలేదు. మర్చిపోయాడు. గభాలున గేట్లు లాగేశాడు.

దూరంగా కెనడియన్ ఇంజన్ 'బయ్'మని కూసింది. వీరస్వామి చేతులవంక చూసుకున్నాడు. జండాకర్రలు ఏవీ మూడంగల్లో ఇంట్లోకొచ్చి జండాలుతీసుకునివచ్చి గేటుదగ్గర నిలబడ్డాడు. చెమట్లు కక్కుతున్నాడు. ఆచార్లుగారూ, వెంకయ్యా యింకా రాలేదు. పసిపాప కెవ్వుమన్న గతచరిత్రలోని అపశ్రుతి చెవుల్లో చిల్లులుచేస్తోంది. దూరంగా కనిపిస్తోంది పొగలు జిమ్ముతూ, కూత వేస్తూ మహావేగంగా వస్తోంది. వీరాస్వామి చూశాడు. కళ్ళు తిరుగుతున్నాయి. పచ్చజండా ఊపుతున్నాడు. ఎంతవేగం....తనభార్య... జ్వరం మూలుగు...ఒక్కతృటిలో ఇంజను వాతావరణాన్నంతా ఊపేస్తూ దాటిపోయింది. వీరాస్వామి చేతిలోని జండా ఊగటంలేదు. ఎత్తి ఉన్న చెయ్యి మెల్లిగా వాలిపోయింది. ఆనుకుని వున్న గేటు వెంబడే నేలవరకూ జారిపోయాడు. చివరిపెట్టెలోంచి గార్డు ఆశ్చర్యంగా చూశాడు గేటునీ, పచ్చజండానీ. మెయిలు వెళ్ళిపోయింది, కాని గేటుతియ్యలేదు వీరాస్వామి. ఆచార్లుగారూ, వెంకయ్యా గేటు సమీపించారు. లోపల్నుంచి మూలుగు వినిపిస్తోంది. వెంకయ్య వీరాస్వామిదగ్గరకు పరుగెత్తుకొచ్చి చూశాడు. వీరాస్వామి?

* * *

వెంకయ్య స్తబ్ధుడయ్యాడు. ఆచార్లుగారికి అర్థంకాలేదు. వెంకయ్య కొంచెం తెప్ప'ల్లి ఫోను దగ్గరకు పరుగెత్తుకెళ్ళి విషయాన్ని క్లుప్తంగా చెప్పాడు. నిమిషాలమీద ట్రాలీలో రైల్వే డాక్టరూ, అసిస్టెంటు స్టేషన్‌మాష్టరూ వచ్చివాలారు. వీరాసామి కళేబరం పరీక్ష చెయ్యబడింది. "గుండె ఆగిపోయింది. ఏదో ఆవేశనవల్ల కూడా ఆగివుండవచ్చు. పైగా రైలువేగానికీ,శబ్దానికీ ఫెయిల్ అయిపోయింది"అన్నాడు డాక్టరు. ఆయన్ను లోపలకు తీసుకెళ్ళి వీరాసామిభార్యను చూపించాడు. డాక్టరు మందు ఇచ్చాడు ఆమెకి. "రెండురోజులవరకూ ఈ కబురు తెలీనీకండి" అన్నాడు డాక్టరు. స్టేషన్‌మాష్టరు వెంకయ్యతో "పాపం! ఆమెకి దిక్కు ఎవరూ లేరుగావున్న, పైకిరాసి కొద్దిరోజుల్లో భరణం తెప్పించియిస్తాం" అని వెళ్ళిపోయారు.

ఆ సాయంత్రమే ఒక పోర్టరు వచ్చాడు ఆక్టింగ్‌గా వీరాస్వామి స్థానంలోకి. వెంకయ్య వీరాసామి భార్యని తన ఇంటికి తీసుకువెళ్ళి తన భార్యచేత ఉపచారం చేయిద్దామనుకున్నాడు. కానీ డాక్టరు వీల్లేదన్నాడు.

మూడురోజుల్లో ఆమె కాస్త తేరుకుంది. రెండుపూటలా ఆచార్యులుగారు వచ్చి, చూసి వెళుతూండేవాడు. ఆనాడు ప్రొద్దునేలేచి మెల్లిగా వాకిట్లోకొచ్చింది. అప్పటివరకూ ఆమెకు వీరాస్వామి సంగతి తెలియదు ఊరికి వెళ్ళాడనీ, స్టేషన్‌మాష్టరుగారు పనుండి పంపించారనీ చెప్పాడు వెంకయ్య. ఆవాళ ఆమె లేచి తిరగడం వల్ల ఇంకా దాచిపెట్టడం భావ్యం కాదని వెంకయ్య ఆమెను కూర్చోపెట్టి సంగతి యావత్తూ మెల్లమెల్లగా చెప్పాడు. ఆమె గోలుగోలున ఏడ్చింది. నేలబడి పొర్లింది. "తన పాప... తన భర్త..." ఆమె ఆవేశంతో అటూ ఇటూ పరుగెత్తింది. దూరంగా కెనెడియన్ ఇంజన్"బయ్"మని కూసింది. ఆమె వేసివున్న గేటుకేసి తల కొట్టుకుంటోంది. ఆమెను ఆ పటం వెంకయ్యకు మించినపనైంది. పొగలుజిమ్ముతూ మహావేగంతో వస్తోంది రైలు. పెద్ద శబ్దంచేస్తూ ప్రదేశాన్నంతా ఊపేస్తూ ఒక్క తృటిలో దాటిపోయింది ఇంజను. ఆమె గేటువెంటే జారిపోయింది. చివరి పెట్టెలోంచి గార్డు ఆశ్చర్యంగా చూశాడు వేసిఉన్న గేటువంకా, ఆమెవంకా.

* * *

ఆ మెయిలులోనే రైల్వేకంపెనీవారు ఆమెకు పంపిన 'భరణం' వచ్చింది. కళ్లు తుడుచుకుంటూ వెంకయ్య "తిప్పి పంపెయ్యండి...ఆ సంసారమంతా మట్టి గలిసింది" అని తన బండియెక్కి మెల్లిగా ఊరివేపు సాగిపోయాడు. ఎడ్లమెళ్ళో గంటలధ్వని మెల్లిగా అనంతవాయువులో కలిసిపోయింది. ★